క్లుప్తంగా

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక


వసురాం


జంగయ్య

దోమ: టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సంఘం సభ్యులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వసురాం, ప్రధాన కార్యదర్శిగా జంగయ్య, ఉపాధ్యక్షుడిగా మల్లేశం, సునీత, కోశాధికారిగా లక్ష్మణ్, సోషల్ మీడియా కన్వీనర్‌గా బాలవర్ధన్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా పాండురంగాచారి, కార్యదర్శులుగా శంకరయ్య, మంగమ్మ, భీమయ్య, భీమ్లా, జిల్లా కమిటీ బాధ్యులుగా ముత్యప్ప, మేఘ్య, వెంకటయ్యలను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. టీఎస్‌యూటీఫ్ ఉపాధ్యాయుల పక్షాన నిరంతరం పోరాటం చేస్తుందన్నారు.

కాంగ్రెస్ యువజన మండల అధ్యక్షుడిగా సుభాష్



మోమిన్‌పేట: కాంగ్రెస్ యువజన మండల అధ్యక్షుడిగా చిట్టంపల్లి గ్రామానికి చెందిన సుభాష్ ఎన్నికయ్యారు. నాలుగు నెలల క్రితం కాంగ్రెస్ అభిమానులైన యువకులు ఆన్‌లైన్లో ఓటింగ్‌లో పాల్గొన్నారు. మండలం నుంచి ఇద్దరు పోటీ చేయగా సుభాష్‌కు 909ఓట్లు రాగా ఆయన ప్రత్యర్థి విష్ణువర్ధన్‌రెడ్డికి 336ఓట్లు వచ్చాయి. దీంతో సుభాష్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా గెలుపొందినట్లు సీనియర్ నాయకులు ప్రకటించారని ఆయన తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ సాధించి తీరుతాం

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ


జగదీశ్ మాదిగకు నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

తాండూరు రూరల్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ సాధించి తీరుతామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ అన్నారు. బుధవారం తాండూరు మండలం ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం మల్లికార్జున్ మాదిగ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలు అభ్యున్నతి సాధిస్తారన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసిన వర్గీకరణ సాధిస్తామన్నారు. అనంతరం కరన్‌కోట్ గ్రామానికి చెందిన జగదీశ్ మాదిగను మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ కార్య క్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జినుగుర్తి నర్సిమలు మాదిగ, స్వామిదాస్, కృష్ణ, శివాజీ, బలరాం, ప్రేమ్, సాయిలు పాల్గొన్నారు.

పిల్లలకు ఆట పాటలతో బోధన

అడిషనల్ సీడీపీఓ శ్రీలక్ష్మి


గొట్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో మాట్లాడుతున్న శ్రీలక్ష్మి

పెద్దేముల్: అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యలో భాగంగా ఆట, పాటలతో బోధించాలని అడిషనల్ సీడీపీఓ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం పెద్దేముల్ మండలం గొట్లపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించి పిల్లలతో మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి నెల పిల్లల బరువులు తీయించాలని ఆదేశించారు. గర్భిణీ, బాలింత, పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఆంజనేయులు ముదిరాజ్

కుల్కచర్ల: కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కుల్కచర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు ముదిరాజ్‌ను నియమిస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన ఆంజనేయులు ముదిరాజ్ 5సంవత్సరాలు మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. పార్టీ అభ్యున్నతికి కృషిచేయడంతో పాటు ఎమ్మెల్యేకు సన్నిహితమైన వ్యక్తిగా గుర్తింపుపొందడంతో ఆయనకు అవకాశం లభించింది. వారం రోజుల్లో ప్రమాణస్వీకరణ నిర్వహించనున్నట్లు సమాచారం. వైస్ చైర్మన్ రామ్మోహన్, కాట్రవత్ రాంచందర్, కేతావత్ సీల్య నాయక్, నాగని ఎల్లయ్య, రాంచంద్రయ్య పాల్గొన్నారు.


భోజన వసతిపై ఆరా తీస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు


గురుకుల బాట స్టిక్కర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం

- గురుకులాలను పరిశీలించిన బీఆర్‌ఎస్వీ నాయకులు
- మధ్యాహ్న భోజన వసతిపై ఆరా

తాండూరు టౌన్: గురుకులాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని నిరసిస్తూ బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో బుధవారం గురుకుల బాట పట్టారు. పట్టణంలోని పలు గురుకులాలను వారు పరిశీలించారు. అక్కడి వసతులు, సమస్యలు, మధ్యాహ్న భోజన వసతిపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలువురు మాట్లాడారు. పేదింటి పిల్లలు చదువుకునే గురుకులాలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా సమస్యల కూపంలోకి నెట్టిందన్నారు. మౌలిక వసతులు కల్పించడంలో విఫలమైందని ధ్వజమెత్తారు. నాసిరకం బియ్యం, పురుగులు పట్టిన భోజనంతో అనేక గురుకులాల్లో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారన్నారు. దీనికి పూర్తి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వమే వహించాలన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో అప్పటి సీఎం కేసీఆర్ నేతృత్వంలో గురుకులాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా కొనసాగాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి గురుకులాల్లో నెలకొని ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శేష్‌పాల్, జంగయ్య, జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయ రావు, పట్టణ బీఆర్‌ఎస్ కౌన్సిలర్ శోభారాణి, నాయకులు శకుంతల, సంజీవరావు, సలీం, ఎబినైజర్, సందీప్ రెడ్డి, రజక నరసింహ్మా, ఇంతియాజ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలి

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట్రాములు


మాట్లాడుతున్న వెంకట్రాములు

కొడంగల్ రూరల్: నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అభివృద్ధి పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ వెంకట్రాములు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో సీపీఎం జిల్లా కమిటీ సమావేశాన్ని బుస్స చంద్రయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్రాములు మాట్లాడారు. లగచర్ల ఘటన అనంతరం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆధ్వర్యంలో వామపక్షాల అగ్ర నాయకులు గ్రామాలను సందర్శించారన్నారు. బాధిత రైతు కుటుంబాలను పరామర్శిస్తూ ఇక్కడి పరిస్థితులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారని గుర్తు చేశారు. ఫలితంగా ఫార్మా భూసేకరణ నోటిఫికేషన్లను రద్దు చేశారన్నారు. రైతుల భూములను తీసుకోకుండా కొడంగల్‌లోని 1,154ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూములను వెంటనే స్వాధీనం చేసుకుని అభివృద్ధికి వాడుకోవాలన్నారు. హకీంపేట రైతు కుటుంబాలను పరామర్శించేందుకు త్వరలో రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం ఆధ్వర్యంలో సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మైసాల్, ఎం వెంకటయ్య, కె శ్రీనివాస్, బుగ్గప్ప, రామకృష్ణ, సుదర్శన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ


తాండూరు టౌన్: పడి వెలిగిస్తున్న మహేందర్ రెడ్డి తదితరులు

తాండూరు టౌన్: ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయంలో బుధవారం మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. పట్నం దంపతుల కుమారుడు రినీష్ రెడ్డి స్వామి వారికి అభిషేకం, 18 మెట్ల పూజ నిర్వహించారు. పడిపూజలో అయ్యప్ప స్వాముల భజనతో ఆలయం మారుమోగింది. ఈ పూజా కార్యక్రమంలో కుమార్తె మనీషా రెడ్డి, అల్లుడు హిమదీప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

అయ్యప్ప మాలధారణ పవిత్రమైంది
మాజీ ఎమ్మెల్యే

కుల్కచర్ల: అయ్యప్ప మాలధారణ పవిత్రమైందని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని మాజీ ఎంపీటీసీ మాలె కృష్ణయ్య నివాసంలో అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అయ్యప్ప మాలధారణతో వ్యక్తి మానసికంగా పరివర్తన చెందుతారన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, మాజీ రైతుబంధు మండల అధ్యక్షుడు రాజు, మాజీ ఎంపీటీసీలు నారాయణ, కృష్ణయ్య, మహేశ్వరం రాములు, పెద్ద నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు కలిగించొద్దు


మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి రాంరెడ్డి

దుద్యాల్: వరి కొనుగోలులో రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని మండల ప్రత్యేక అధికారి రాంరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు అమ్మకానికి తెచ్చిన ధాన్యాన్ని పరిశీలించి తీసుకోవాలన్నారు. ధాన్యాన్ని ఎండబెట్టి తీసుకొచ్చినట్లయితే నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ తరుగు తీయకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరమేరకు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలులో రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ వీరేశ్‌బాబు, ఆర్‌ఐ రవి కిశోర్, పీఏసీఎస్ డైరెక్టర్ ఖలీల్ పాషా పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **పంటల నమోదు పరిశీలన**

దుద్యాల్: నాజుఖాన్‌పల్లి గ్రామంలో క్రాప్ నమోదు ప్రక్రియను కొడంగల్ ఏడీఏ శంకర్ రాథోడ్ బుధవారం పరిశీలించారు. కంది పంటకు సంబంధించిన వివరాలను ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో పంట వివరాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కంది పంట కోతదశలో ఉన్నందున కాయ రాలకుండా జాగ్రత్తలు పాటించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్ యువజన మండల అధ్యక్షుడిగా జంగయ్య**

కుల్కచర్ల: కుల్కచర్ల కాంగ్రెస్ యువజన విభాగం మండల అధ్యక్షుడిగా పీరంపల్లి గ్రామానికి చెందిన జంగయ్య ఎన్నికైనట్లు పార్టీ నేతలు ప్రకటించారు. సంస్థాగతంగా ఆన్‌లైన్ ఓటింగ్ ద్వారా ఎన్నిక నిర్వహించగా పీరంపల్లి గ్రామానికి చెందిన చింతకాయల జంగయ్య అత్యధిక ఓట్లను సాధించినట్లు పార్టీ ప్రకటించింది.

◆ **సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం**

బంట్వారం: ఆపదలో ఉన్న పేదవారికి సీఎంఆర్‌ఎఫ్ వరమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం పేర్కొన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని యాచారం గ్రామానికి చెందిన అనంతయ్యకు మంజూరైన రూ.60వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మెరుగైన వైద్యం కోసం ఇది ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమేశ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

◆ **బైక్‌ర్యాలీని విజయవంతం చేయాలి**

పరిగి: ఈ నెల 7న నియోజకవర్గంలో నిర్వహించనున్న బీజేపీ బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా ప్రజలకు చేసిందేమి లేదన్నారు. సంవత్సరంలో ప్రభుత్వం చేసిన పనులపై, ఇచ్చిన హామీలపై బీజేపీ చార్జ్ షీట్ వేస్తుందన్నారు. ప్రజలను మోసం చేసి అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు బీజేపీ పోరాటం చేస్తుందన్నారు.

◆ **నిధులు మంజూరు**

బొంరాస్‌పేట: బాపన్‌చెర్వు తండా గ్రామ పంచాయతీ పరిధిలోని గిర్కబాయితండా రోడ్డుకు నిధులు కేటాయించినట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింలు, సీనియర్ నాయకుడు రాంరెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొడంగల్ నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో గిరిజన తండాలు అభివృద్ధి బాటపట్టాయన్నారు. పార్టీ నియోజకవర్గ ఇంచార్జి తిరుపతిరెడ్డి కృషితో తండాలకు, సరిహద్దు మండలాల గ్రామాలకు బీటీ రోడ్లకు నిధులు మంజూరు కానున్నాయని పేర్కొన్నారు.

యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా రెడ్డి శ్రీనివాస్



దౌల్తాబాద్: కొడంగల్ యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ఎన్నికల నిర్వహణ కమిటీ ప్రకటించింది. ఈ అధ్యక్ష పదవికి నలుగురు పోటీ పడ్డారు. మొత్తం 2,223 ఓట్లు పోల్ అవ్వగా రెడ్డి శ్రీనివాస్‌కు 1,942 ఓట్లు పోల్ అయ్యాయి. దీంతో అత్యధిక మెజార్టీతో విజయం సాధించాడు. యువజన కాంగ్రెస్ విభాగంలో వరుసగా రెండు సార్లు నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం విశేషం.

వికారాబాద్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడిగా అవినాశ్‌రెడ్డి



ధారూరు: యువజన కాంగ్రెస్ ఎన్నికల ఫలితాలను బుధవారం జిల్లా కాంగ్రెస్ ప్రకటించింది. ధారూరు మండలంలోని ధర్మాపూర్ గ్రామానికి చెందిన అవినాశ్‌రెడ్డి వికారాబాద్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తన గెలుపునకు యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేశారని, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, మండల అధ్యక్షుడు మాన్‌సింగ్, ఏఎంసీ చైర్మన్ భాస్కర్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించని యాజమాన్యం

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్‌కోట్ గ్రామ శివారులోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా అణగదొక్కుతున్నారని కార్మిక సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా కలెక్టర్‌తో పాటు ఎస్పీ, డీఎస్పీ, ఎస్ఐలకు వారు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీసీఐ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, సీఐటీయూ నాయకులు శరణప్ప మాట్లాడారు. కార్మికులు చనిపోతే వారి కుటుంబానికి గ్రాట్యువిటీ, పెన్షన్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దోమ: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం దోమ మండల పరిధిలోని తిమ్మాయిపల్లి ఫారెస్ట్‌లో ప్రజాపాలన విజయోత్సవాల భాగంగా అడవులలో అగ్ని ప్రమాదాలు జరిగితే అరికట్టే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భవిష్యత్తు తరాల మనుగడకు ఇబ్బంది లేకుండా ప్రతిఒక్కరూ మొక్కలు నాటి భూమిని జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రెంజ్ ఆఫీసర్ జి ప్రతిమా, అధికార్లు హోమి, సాయి కుమార్, శ్రీధర్, మంజీత్‌సింగ్, బీట్ ఆఫీసర్లు భీమ్లా, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ బంగ్ల యాదయ్యగౌడ్, నాయకులు లాల్‌కృష్ణ, శివకుమార్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర సర్వే ఆన్‌లైన్


మోమిన్‌పేట: సర్వే వివరాలను ఆన్‌లైన్ చేస్తున్న ఎన్యుమరేటర్లు

మోమిన్‌పేట: సమగ్ర కులగణన సర్వే పూర్తయిన కుటుంబాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఆన్‌లైన్ చేసే బాధ్యతను పూర్తిగా ఆయా గ్రామాల్లో ఎన్యుమరేటర్లకు, కార్యదర్శులకు అప్పగించారు. కంప్యూటర్ ఆపరేటర్లు ఒక్కో దరఖాస్తును తప్పులు లేకుండా నమోదు చేయాలని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు.

దౌల్తాబాద్‌లో..


దౌల్తాబాద్: డేటా ఎంట్రీ చేస్తున్న ఆపరేటర్లు

దౌల్తాబాద్: మండలంలో వారం రోజులుగా సర్వే డేటా నమోదు ముమ్మరంగా కొనసాగుతుంది. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నమోదు చేస్తున్నారు. మండలంలో 13,942 కుటుంబాల సర్వేకుగాను ఇప్పటి వరకు 7,668 కుటుంబాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు.

న్యాస్ పరీక్ష సామర్థ్యాలను పరీక్షిస్తుంది


బొంపల్లి పాఠశాలలో న్యాస్ పరీక్ష వ్రాస్తున్న విద్యార్థులు

దోమ: విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించడంలో న్యాస్ పరీక్ష ఎంతో దోహదపడుతుందని ఎంఈఓ వెంకట్ పేర్కొన్నారు. బుధవారం దోమ మండల పరిధిలోని బొంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు న్యాస్ (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే 2024) పరీక్షకు ఎంపిక కావడంతో వారికి న్యాస్ పరీక్ష నిర్వహించామన్నారు. దీంతో విద్యార్థుల మేధాశక్తి పరిశీలించొచ్చన్నారు. రాష్ట్రంతో పాటు జిల్లా, గ్రామీణ విద్యాభివృద్ధికి న్యాస్ సులభతరంతో అర్థవంతమైన విధంగా ఉపయోగకరంగా నిలుస్తుందన్నారు. విద్యార్థులు వారి ప్రతిభను మెరుగుపర్చుకునేందుకు ఈ పరీక్షలు ఉపయోగరంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు షాహేదబేగం, పీల్డ్ ఇన్వేష్టిగేషన్ అధికారి సుజాత, సీఆర్పీ వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికి తీయాలి


బహుమతులు ప్రదానం చేస్తున్న అధికారులు

పరిగి: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని తహసీల్దార్ ఆనంద్‌రావు సూచించారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణ కేంద్రంలోని భవిత కేంద్రంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. లక్ష్య సాధనకు ఏది అడ్డుకాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కరీం, మండల విద్యాధికారి గోపాల్, భవిత సెంటర్ ఉపాధ్యాయులు మహేందర్‌గౌడ్, చంద్రశేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హిందువులపై దాడులకు నిరసనగా ర్యాలీలు


తాండూరు టౌన్: హిందూ ధర్మ పరిరక్షణ సమితి ర్యాలీలో పలు సంఘాల సభ్యులు

తాండూరు టౌన్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం తాండూరు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా, కుల సంఘాలు, విద్యార్థి సంఘాలు, వ్యాపార, వర్తక సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. స్థానిక భద్రేశ్వర్ చౌక్ నుంచి పురవీధుల గుండా నిర్వహించారు. దాడులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. హిందు ధర్మం, హిందువులపై దాడులు నిత్యకృత్యంగా మారాయన్నారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీలుగా ఉన్న హిందువులపై అక్కడి ఓ వర్గం మారణకాండ సృష్టిస్తున్నారన్నారు. ఈ ర్యాలీలో పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్, కౌన్సిలర్లు, హిందు ఉత్సవ కేంద్ర సమితి సభ్యులు, పలు హిందుధార్మిక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్ల: హిందుత్వవాదాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని పీఎస్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ అన్నారు. కులకచర్ల మండల కేంద్రం నుంచి ఆర్‌ఎస్‌ఎస్ మరియు హిందు సంఘాల ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన నిరసన ర్యాలీ కార్యక్రమానికి భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో హిందుత్వవాదులపై దాడులు చేయడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో కొండయ్య, రవి, శ్రీనివాసులు, కాంగారి ఆంజనేయులు, బిచ్చయ్య, లోక్య, మల్లేష్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: దేశంలోని హిందువులంతా ఐక్యతను చాటాలని బసిరెడ్డిపల్లి క్రిష్ణగిరి పీఠాధిపతి కృష్ణానందా స్వామిజీ అన్నారు. బుధవారం వికారాబాద్‌లో బంగ్లాదేశ్‌లో హిందులపై జరుగుతున్న దాడులకు నిరసనగా హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కొత్తగంజ్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీలో పట్టణంలోని హిందు సంఘాలు, ఆయా పార్టీల నాయకులు, కులసంఘాల నాయకులు వర్తక, వాణిజ్య సంఘాల నాయకులు యువజన సంఘాలు, ఆధ్యాత్మిక వేత్తలు, ఆయా పార్టీల నాయకులు, మహిళ సంఘాల ప్రతినిధులు భారీ ఎత్తున తరలివచ్చారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హింసను వెంటనే ఆపాలన్నారు.


కుల్కచర్ల: ర్యాలీకి వెళ్తున్న హిందూ సంఘాల నాయకులు


అనంతగిరి: వికారాబాద్‌లో నిరసన ర్యాలీ